క్లుప్తంగా

జేపీఎస్, ఓపీఎస్‌ల బైక్‌ర్యాలీ



మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమను రెగ్యులర్ చేస్తూ జేపీఎస్, ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ మంచిర్యాల ఐబీ చౌరస్తాలో చేపట్టిన సమ్మె గురువారం 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. వెంటనే తమను రెగ్యులర్ చేసి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు.

మొక్కలు కాపాడేందుకు ప్రత్యేక చర్యలు



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమారం: మండలంలోని బూర్గుపల్లి నర్సరీని ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం సందర్శించారు. కార్యదర్శులు సమ్మెలో ఉన్న కారణంగా నర్సరీలోని మొక్కలు ఎండల నుంచి కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

సిద్ధమైన బస్తీ దవాఖాన



బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లా కేంద్రంలోని సాయికుంటలో రూ.13లక్షలతో నిర్మించిన బస్తీ దవాఖానా ప్రారంభానికి సిద్ధమైంది. దీంతో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు బస్తీ దవాఖానాను పరిశీలించి, ప్రారంభించేందుకు అవసరమైన అన్ని రకాల సేవలను సిద్ధం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

బెల్లంపల్లి తహసీల్దార్‌గా మధుసూదన్



బెల్లంపల్లి: మండల తహసీల్దార్‌గా డి.మధుసూదన్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న జి.కుమారస్వామి అనారోగ్య సమస్యలతో సెలవు పెట్టడంతో డెప్యూటీ తహసీల్దార్ జాదవ్ మాణిక్‌రావును ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. కాగా కుమారస్వామి స్థానంలో మంచిర్యాల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మధుసూదన్‌ను ఫుల్ అడిషనల్ చార్జీతో బెల్లంపల్లి తహసీల్దార్‌గా నియమించారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ బదావత్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా విధుల్లో చేరిన మధుసూదన్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్కే 7 ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్కే 7 ఫిట్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. గనిపై జరిగిన ఫిట్ కమిటీ సమావేశంలో ఫిట్ సెక్రెటరీగా బర్రిగెల ప్రతాప్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా జాడి రాజ్‌కుమార్, రిలే ఇన్‌చార్జులుగా ఆర్.యాదగిరి, కాదాసి హరీశ్, కొండ్రా కార్తిక్, వకపల్లి వెంకటేశ్వర్లు, మీసాల మహేందర్, అడ్వైజర్‌లుగా విజయ్‌కుమార్, రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా నాయకులు వేల్పుల ప్రవీణ్, గోదారి మురళీ, లక్ష్మణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

దిగబడిన సిమెంట్ లారీ



మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్ రైల్వేస్టేషన్ రోడ్డు బ్రాంచ్ స్కూల్ పక్క గల్లీ మూల మలుపు వద్ద కల్వర్టులో గురువారం సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ దిగబడింది. దీంతో స్టేషన్‌రోడ్డు వైపు వెళ్లే వారికి ఇబ్బంది ఏర్పడింది. కొంతసేపటికి జేసీబీ సాయంతో దిగబడిన లారీని బయటకు తీశారు. ఇష్టారీతిగా కాలనీల్లోకి హెవీ లోడుతో వాహనాలు వెళ్తున్నాయని, పట్టణంలో చాలా చోట్ల కల్వర్టులు కూలిపోయి ఉన్నాయని హెవీలోడ్‌తో వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సమష్టి కృషి.. సత్ఫలితం

ఎలాగైనా మండల టాపర్‌గా నిలువాలనే పట్టుదల, సమష్టి కృషి, ఆ పాఠశాలకు సత్ఫలితాన్ని ఇచ్చింది. ఉపాధ్యాయుల పనితనానికి నిదర్శనంగా మారింది. పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన కలమడుగు ప్రభుత్వ పాఠశాల, జెడ్పీఎస్ఎస్ పాఠశాలల స్థాయిలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాలపై ప్రత్యేక కథనం..



- జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన కలమడుగు పాఠశాల
- ఉపాధ్యాయుల టీం వర్క్ ఫలితం

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పోటీ పరీక్షల్లో పేరు తెచ్చుకుంటున్నారు. గతంలో ఫలితాల్లో వెనుకంజలో ఉన్న ఈ పాఠశాల, గత నాలుగు సంవత్సరాలుగా జాతీయ ఉపకారవేతనాల ఎంపికలో, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల నుంచి పది జీపీఏ పాయింట్లు తెచ్చుకుంటామని పలు సందర్భాల్లో తెలిపిన పాఠశాల ఉపాధ్యాయ బృందం ఈ విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో శ్రీరాముల సంహిత అనే విద్యార్థిని పది జీపీఏ పాయింట్లు సాధించింది. దీంతో పాటు మరో పది మంది తొమ్మిది పాయింట్లకు పైగా పాయింట్లు సాధించడంతో పాటు 49మంది విద్యార్థులకు గాను 47మంది ఉత్తీర్ణత పొంది 96శాతం ఉత్తీర్ణత సాధించారు.

నిరంతరం పర్యవేక్షణ..

విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ కనబరిచేలా నిరంతరం ఉపాధ్యాయుల నుంచి ప్రోత్సాహం అందించారు. హెచ్ఎం జాడి ప్రభాకర్ ఆదేశానుసారం పదో తరగతి విద్యార్థులకు జూలై మాసం నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు వాట్సాప్ గ్రూపు తయారు చేశారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు ఉదయం 4గంటలకు చదువు ప్రారంభించి, వాట్సాప్ గ్రూపులో ఫొటోతో సమాచారం ఇవ్వాలి. సమాచారం వేయని విద్యార్థులకు ఉపాధ్యాయులు ఫోన్ చేసి నిద్రలేపి చదివించేవారు. ఇలా ప్రతిరోజు ఇంట్లో చదివేలా పర్యవేక్షణ చేశారు. అదే విధంగా పాఠశాలలో ఉదయం 8గంటల నుంచి పది గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. జూలై మాసం నుంచే ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయడంతో విద్యార్థుల్లో ఉత్సాహం నింపడంతో పాటు చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

సంహితకు రూ.10,116విరాళం

పదో తరగతి ఫలితాల్లో పది జీపీఏ పాయింట్లు సాధించిన శ్రీరాముల సంహితకు జాడి లక్ష్మి, రాజలింగుల జ్ఞాపకార్థం ఉపాధ్యాయుడు జాడి మురళి ప్రతి సంవత్సరం పదో తరగతిలో పది జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులకు అందించే నగదు ప్రోత్సాహం రూ.10,116 అందజేయనున్నారు.

విద్యార్థులను దత్తత తీసుకొని..

ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించడమే కాకుండా, వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు ఐదుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకుని వారిని చదివించే బాధ్యత తీసుకున్నారు. సబ్జెక్టుపై అనుమానాలను నివృత్తి చేసేవారు. ఇలా ప్రతి నెల విద్యార్థుల్లో ప్రగతిని గమనించేవారు. పదో తరగతి విద్యార్థులతో పాటు 8, 9తరగతుల విద్యార్థుల చదువుపై శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇలా ఉపాధ్యాయుల సమష్టి కృషి ఇప్పుడు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించేలా చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుపై ఉపాధ్యాయులు, శ్రద్ధ చూపడం, చదివించడం పాఠశాలల్లో పోటీతత్వం కనిపిస్తుంది. గత సంవత్సరం కిష్టాపూర్, ఇందన్‌పల్లి, బాదంపల్లి, కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల మధ్య ఈ పోటీ కనిపించగా కిష్టాపూర్ ఉన్నత పాఠశాల మొదటిస్థానంలో నిలిచేది. ఈ సంవత్సరం తోటి పాఠశాలలతో పోటీపడి కలమడుగు ఉన్నత పాఠశాల మొదటి స్థానంలో నిలువడంతో పాఠశాలల మధ్య పోటీతత్వం కనిపిస్తోంది.

సమష్టి కృషి ఫలితమే

ఈ సారి ఎలాగైనా పది పాయింట్లు సాధించాలని నిర్ణయించుకున్నాం. ఉపాధ్యాయులందరం సమష్టి కృషితో పనిచేయడం వల్లే ఈ ఫలితం వచ్చింది. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటుగా, నిరంతరం పర్యవేక్షణ, ప్రత్యేక తరగతుల నిర్వహణ ఫలితాలు ఇచ్చాయి. ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తాం. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం మాకు మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చింది.

- జాడి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు

తొలగనున్న కరెంట్ కష్టాలు

- వేమనపల్లికి సబ్‌స్టేషన్ మంజూరు



సబ్‌స్టేషన్ నిర్మిత స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు(ఫైల్)

వేమనపల్లి: మండల ప్రజలకు ఎట్టకేలకు కరెంట్ కష్టాలు తొలగనున్నాయి. మండల కేంద్రంలో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ.2కోట్ల 48లక్షల 45వేల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. మండలం మొత్తానికి నీల్వాయి సబ్‌స్టేషన్ ఉండగా, గత కొన్ని సంవత్సరాలుగా ఓవర్ లోడ్ కారణంగా తరచూ విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలిగేది. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలి వేణుమాదవ్ సమస్యను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేశారు. తహసీల్దార్‌తో మాట్లాడి సర్వే నం.6లో ఎకరం ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీంతో స్థలం నిర్ణయించి గత మార్చిలో ట్రాన్స్‌కో అధికారులకు తహసీల్దార్ రాజ్‌కుమార్ జిమ్మా ప్రతిని అందజేశారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాలరావు దృష్టికి తీసుకెళ్లగా గురువారం సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంజూరు లభించింది. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

భిక్షాటన చేసి.. నిరసన తెలిపి



భిక్షాటన చేస్తున్న వీవోఏలు

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీవోఏలు వినూత్న నిరసన చేపట్టారు. సమ్మెలో భాగంగా గురువారం వీవోఏలు మండలంలోని ఆకెనపల్లి, లింగాపూర్, పాతబెల్లంపల్లి, బెల్లంపల్లి మున్సిపాలిటీలోని కాల్‌టెక్స్ ప్రాంతంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.20
పచ్చిమిర్చి	60
వంకాయ	40
కాకరకాయ	70
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
సోరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	60
క్యారెట్	60
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	80

- మంచిర్యాలఅగ్రికల్చర్



సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మందమర్రిరూరల్: మండలంలోని శంకర్‌పల్లిలో గురువారం సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సల్లూరి సది, సింగరేణి వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎంహెచ్‌డీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా శ్రీనివాస్

చెన్నూర్: మాదిగ హక్కుల దండోరా చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆసంపల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు ఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి వెంకటేశ్, జిల్లా ఇన్‌చార్జి దాసరి బానయ్య తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

శ్రీరాంపూర్: ఉద్యోగులు డ్యూటీలకు బైక్‌పై వచ్చేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి రావాలని గురువారం శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేక చాలా మంది అక్కడికక్కడే మృతి చెందుతున్నారని, హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో గని మేనేజర్ సుదీర్ జక్కులవార్, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, సేఫ్టీ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ అమ్జద్‌అలీ, సంక్షేమ అధికారి బొంగోని శంకర్ పాల్గొన్నారు.

బీరువా వితరణ

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రామిల్ల సాయి నవ్య అనే నిరుపేద అనాథ యువతి వివాహానికి లక్సెట్టిపేట రోటరీ క్లబ్ సభ్యులు తమవంతు సహాయంగా బీరువా, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్, సభ్యులు రమేశ్, కిషన్, సతీష్, శ్రీనివాస్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-2007సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం అదే పాఠశాలలో ఒకేచోట కలిసారు. ఆనాటి తీపీ జ్ఞాపకాలు గుర్తుచేసుకుని, ఆలింగనం చేసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటలు ఆడి, పాటలు పాడి సందడిగా గడిపారు. కార్యక్రమానికి చదువుచెప్పిన గురువులను ఆహ్వానించగా హెడ్మాస్టర్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కామ రమేశ్, సత్యనారాయణరెడ్డి, పవన్, కృష్ణమూర్తి హాజరయ్యారు. గురువుల ఆశీర్వాదం తీసుకుని విద్యార్థులు వారిని ఘనంగా సత్కరించారు.

-భీమారం



పైప్‌లైన్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం జీఆర్ పీ పైప్‌లైన్ తొలగించి, కొత్తగా వేస్తున్న ఎమ్మెస్ పైప్‌లైన్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఆర్‌పీ పైప్‌లతో తరచూ లీకేజీలు ఏర్పడటంతో, సాగునీటి సరఫరాకు ఆటంకాలు కలిగేవి, ఇక ఆ సమస్యను తీర్చడం కోసం వాటిని తొలగించి ఎమ్మెస్ పైప్‌లు వేస్తున్నట్లు తెలిపారు. వీటితో ఇక లీకేజీ సమస్యలు ఉండవన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, లక్సెట్టిపేట మున్సి పల్ చైర్మన్ కాంతయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు లింగన్న, సురేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, దండేపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను గురువారం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, డ్రెయినేజీని, కృష్ణా కాలనీలోని 3వ వార్డులో రూ.7లక్షలతో నిర్మించిన డ్రెయినేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ నాయకులు కే సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీటీసీలో రక్తదాన శిబిరం



రక్తదాతకు ప్రశంసాపత్రం అందిస్తున్న తహసీల్దార్

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు సమీపంలో గల గనుల వృత్తి శిక్షణా కేంద్రం(ఎంవీటీసీ)లో గురువారం తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 54మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేవారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు అందించనున్నట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ శంకర్, ఎంపీపీ భీరయ్య, వైద్యాధికారి శివప్రతాప్, ఆర్ఐలు నవీత్, రవికిశోర్, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, లక్ష్మీనారయణ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై నరేష్‌ను ప్రశంసించిన సీపీ



ఎస్సై నరేష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ, డీసీపీ

భీమిని: కన్నెపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినందుకుగాను రామగుండం సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ కన్నెపల్లి ఎస్సై నరేష్‌ను గురువారం ప్రశంసించారు. కన్నెపల్లి మండలంలోని 15గ్రామపంచాయతీల్లో 53 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో నిఘా నీడలో ఉండేలా ఏర్పాటు చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఈ నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. దీంతో ఎస్సై నరేష్‌ను సీపీ, డీసీపీలు అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని షంషీర్‌నగర్‌లో ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్మకాలు సాగిస్తున్నారని టీడీపీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి అమానుల్లాఖాన్, కాంగ్రెస్ పట్టణ నాయకుడు ఎండీ.గౌస్ తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారం మాటున ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఇదివరకు ఆ భూమిని కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేశారన్నారు. మళ్లీ అదే తీరుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకుని విక్రయిస్తున్న వ్యవహారంపై, తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, ఆక్రమణకు గురైన సర్కారు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

వీల్‌చైర్లు నిరుపయోగం..!



మంచిర్యాలఅర్బన్: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు దివ్యాంగ ప్రయాణికుల సౌకర్యార్థం ఓ దాత ఇచ్చిన వీల్‌చైర్లను సిబ్బంది చెత్తలో చేర్చారు. మంచిర్యాలకు చెందిన రమేశ్‌శర్మ రెండేళ్ల కిందట అందించగా, కుర్చీలు వినియోగించకుండానే బస్‌స్టేషన్‌లో విచారణ కేంద్రం పక్కన ఉన్న ఓ గది(దుకాణం)లో మూలన పడేశారు. ఇటీవల దుకాణాన్ని ఓ టెండర్‌దారుడు దక్కించుకోవటంతో వీల్‌చైర్లను ఇటీవల కాలంలో కార్గో సర్వీసు కేంద్రం పక్కన చెత్త పడేసే చోటుకు చేర్చటంతో నిరుపయోగంగా మారాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఎండకు ఎండుతూ.. వానకు తడిచి తుప్పుపట్టిపోయే అవకాశాలున్నాయి. వెంటనే అధికారులు చొరవ తీసుకుని దివ్యాంగులకు ఉపయోగపడేలా అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ ఎంపీపీ

చెన్నూర్‌రూరల్: బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కిష్టంపేటలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేయగా మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాకేష్, ఉప సర్పంచ్ ముకుందరెడ్డి, ఎంపీటీసీలు పద్మ, శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.